నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, సోమవారం 21 ఏప్రిల్ 2025 MEDAK



ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న ధ్యానాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు

## హనుమాన్ అనుగ్రహంతోనే రాష్ట్రం సుభిక్షం

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

వర్గల్, ఏప్రిల్ 20 : హనుమాన్ అనుగ్రహంతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉందని, మానసిక ప్రశాంతతకు నాచారం ధ్యానాంజనేయస్వామి ఆలయం తార్కాణంగా ఉందని జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట సమీపంలో వెలిసిన ధ్యానాంజనేయస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన యజ్ఞంలో అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ వ్యవస్థాపకుడు తాత నర్సింగారావు సువిశాల ప్రాంతంలో ధ్యానాంజనేయస్వామి ఆలయం నాచారంగుట్ట పరిధిలో నెలకొల్పడం హనుమాన్ భక్తులకు మహాభాగ్యమన్నారు. దుర్గాప్రసాద్ స్వామి ఆశీస్సులు, హనుమంతుడి దయవల్ల బీఆర్‌ఎస్ పార్టీకి ఎప్పటికీ జయమే కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు ఆలయం తరపున పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నాచారం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ యాదగిరి, ఆలయ సభ్యుడు పంది నగేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



యాగశాలలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కుమ్మరికుంటలో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూర్, ఏప్రిల్ 20: రంగనాయకసాగర్ రిజర్వాయర్ నిర్మించిన కేసీఆర్, హరీశ్‌రావు పేర్లు చరిత్రలో నిలిచిపోతాయని మాజీ ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కొండెంగలకుంట గ్రామ శివారులోని కుమ్మరికుంట, చెక్‌డ్యామ్ నిండడంతో మాజీ సర్పంచ్ ఎల్లయ్య ఆధ్వర్యంలో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండల్లో చెక్‌డ్యామ్ మత్తడిపారడం సంతోషంగా ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్పేరోజులు దగ్గర పడ్డాయన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సొంత నిధులతో కాల్వ పనులు పూర్తి చేయించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సహకారంతో మాచాపూర్ నుంచి ఎల్లాయపల్లి,కొత్తపల్లి, అల్లిపూర్ గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని, భూ సమస్యలను ఇరిగేషన్ అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎటు చూసినా పచ్చని పంట పొలాలు కనిపిస్తున్నాయన్నారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసినందుకు కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య,బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు భూమారెడ్డి, మాజీ సర్పంచ్ మొండయ్య, నాయకులు రాజు, దేవయ్య, హనుమయ్య పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులెప్పుడో?



సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై గుంతలు

- సిద్దిపేట జిల్లా గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ ప్రధానరోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గజ్వేల్, ఏప్రిల్ 20 : సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చడం లేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రోడ్డుపై తారు లేచిపోవడంతో పదుల సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులకు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పట్టించుకోని అధికారులు**

గతంలో రెండు లేన్లుగా ఉన్న రోడ్డును కేసీఆర్ అధికారంలోకి రాగానే నాలుగు లేన్లుగా వెడల్పు చేయించి మధ్యలో డివైడర్, బటర్‌ఫ్లై లైట్లు, ఇరువైపులా మొక్కలు నాటించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న రోజుల్లో రోడ్డుపై ఎక్కడ గుంతలు పడినా వెంటనే మరమ్మతులు చేసిన అధికారులు ప్రస్తుతం పట్టించుకోవడం లేదు. నిత్యం అదే మార్గంలో సంబంధిత అధికారులతో పాటు ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రోడ్డుకు మోక్షం కలగడం లేదు. రోజు ఇదే మార్గంలో వాహనదారులు తమ గమ్యస్థానాలకు వేలాదిగా వెళ్తుంటారు. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

## ఆధ్యాత్మికసేవలో ఆర్యవైశ్యులు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సదాశివపేట, ఏప్రిల్ 20 : ఆధ్యాత్మిక సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరి మందిరంలో దిడిగె శంకర్‌గుప్తా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సుహాసిని పూజకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు దిడిగె నగేశ్ హరీశ్‌రావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు అంజయ్య, వైశ్య సంఘం అధ్యక్షుడు మాశెట్టి ప్రకాశం, ఆలయ సంఘం అధ్యక్షుడు సాయిరాజు, సభ్యులు శ్రీనివాస్, శంకర్, మల్లేశం, వంశీ, సుధాకర్, రాజయ్య, భిక్షపతి, వినోద్, రమేశ్, కృష్ణ, చంద్రయ్య, పురం రజినీ, సుజాత, శ్రీదేవి, లక్ష్మి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు ఉప్పెనలా కదిలిరావాలి





హుస్నాబాద్ టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, సిద్దిపేట : సిద్దిపేట జిల్లా గట్లమల్యాలలో కూలి అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- నియోజకవర్గం నుంచి 50 వేల మంది హాజరుకావాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 20: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉప్పెనలా తరలిరావాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ టౌన్, హుస్నాబాద్, అక్కన్నపేట, చిగురుమామిడి, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన బీఆర్‌ఎస్‌నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం ఆదివారం హుజూరాబాద్‌లోని సింగాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ నుంచి 50వేల మంది నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. బైక్‌లు, ఆటోలు, జీపులు, ట్రాక్టర్లు, బస్సులతో పాటు అందుబాటులో ఉన్న వాహనాల్లో ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కనీవినీ ఎరుగని రీతిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ జరగనుందని, హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగేసభకు అన్నివర్గాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విధంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేయాలని ఆయన సూచించారు. రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు చైతన్యమైన హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి జనసైన్యం దండులా కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కూలిపని చేసిన బీఆర్‌ఎస్ నాయకులు**

సిద్దిపేట, ఏప్రిల్ 20: బీఆర్‌ఎస్ 25 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు మేము సైతం అంటూ సిద్దిపేట జిల్లా గట్లమల్యాల బీఆర్‌ఎస్ నాయకులు కూలిపని చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన రైతులు బుద్ధి తిరుపతి, పుట్ట మధుకర్ పొలంలో వ్యవసాయ పనుల్లో వారు పాల్గొన్నారు. ఇందుకు రైతులు బీఆర్‌ఎస్ నాయకులకు కూలిగా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రేణుకావేణుగోపాల్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎర్రబాబు, నాయకులు వీర్యానాయక్, ప్రకాశ్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, తిరుపతి, భిక్షపతి, పరశురాములు, రాజు, కోటయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

**అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

పుల్కల్, ఏప్రిల్ 20: సింగూరు ప్రాజెక్టు ద్వారా నీరందక పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభవాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా రైతుబంధుకు దిక్కేలేదని, ఆరు గ్యారెంటీల ఊసేలేదన్నారు. మంత్రులు పాలన గాలికివదిలేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీకి భారీ మెజార్టీ ఖాయమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గులాబీపార్టీకి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు కార్యకర్తలు ఎండగట్టాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగుతుండగానే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు ఫోన్ చేయడంతో వెంటనే ఆసందేశాన్ని స్పీకర్ ఆన్‌చేసి వినిపించారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జైపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, నాయకులు నర్సింహారెడ్డి,యాదగిరిరెడ్డి,ఉపాధ్యక్షులు కిషన్‌గౌడ్, విష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పడమటి రమేశ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, మహేశ్‌బాబు, మఠం సిద్ధన్న, లోకేశ్, కనకారెడ్డి, ఎర్రోళ్ల పోచయ్య పాల్గొన్నారు.



పుల్కల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

## కాటేజీ నిర్మాణానికి రూ.15లక్షల విరాళం



మల్లన్న క్షేత్రంలో కాటేజీ నిర్మాణం కోసం రూ.15లక్షల విరాళం చెక్కు అందజేస్తున్న దాత

చేర్యాల, ఏప్రిల్ 20 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో డోనర్ స్కీంలో భాగంగా 100 కాటేజీలు నిర్మించేందుకు ఆలయ ఈవో అన్నపూర్ణ ఇటీవల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మొట్టమొదటగా హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన దాత వినోద్‌కుమార్ స్వాతి దంపతులు రూ.15లక్షల చెక్కును తల్లిశారద చేతుల మీదుగా ఆదివారం ఆలయ ఈవోకు అందజేశారు.ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ స్వామి వారి క్షేత్రంలో తండ్రి విఠల్‌రావు జ్ఞాపకార్థం కాటేజీ నిర్మించేందుకు విరాళం అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ మల్లన్న క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సమయంలో గదులు లభించక అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించేందుకు మల్లన్న క్షేత్రంలోని అన్నప్రసాద వితరణశాల సమీపంలో 100 కాటేజీలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించి నిధులు ఇవ్వాలని దాతలను కోరినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన దాత రూ.15లక్షల విరాళం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చిమల్లన్న క్షేత్రాభివృద్ధికి విరివిగా విరాళాలు అందించాలని ఆమె కోరారు. ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ సతీశ్,సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## 75వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు



ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న మహిళా జేఏసీ సభ్యులు

గుమ్మడిదల, ఏప్రిల్ 20 : ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా బాధిత గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలు 75వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్, నల్లవల్లి గ్రామాల్లో చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు. 75 రోజుల నుంచి డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు, దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయడం లేదని రైతు జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు జేఏసీ నాయకులు ఆంజనేయులు, సురేశ్, మన్నె రామకృష్ణ, శంకర్, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.





మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి


## ఎమ్మెల్యే రోహిత్‌పై కేసు నమోదు చేయాలి

మెదక్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : మెదక్ ప్రజల గౌరవాన్ని పెంచే విధంగా ఎమ్మెల్యే రోహిత్ వ్యాఖ్యలు ఉండాలి.. కానీ అతని వ్యాఖ్యలు దిగజార్చే విధంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 17న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అతనిపై కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఆదివారం ఆమె మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిద్ధాంతపరంగా విమర్శలు చేసుకోవాలి కానీ ఇది సమంజసం కాదన్నారు. చట్టాలు చేసే ఎమ్మెల్యేనే సమాజానికి ఏమి మెసేజ్ పంపుతున్నారని ధ్వజమెత్తారు. పద్ధతి మార్చుకొని మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చారు కానీ వాటిని నెరవేర్చి అభివృద్ధి పథంలో నడిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలు అమలు పర్చాలన్నారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రామయంపేటలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఫిర్యాదు చేస్తే ఇది మా పరిధిలోకి రాదంటూ ఆఫిర్యాదును తిరస్కరించారన్నారు. అలాంటప్పుడు బీఆర్‌ఎస్ కార్యకర్త రవీందర్‌రెడ్డిని పీఎస్‌కు తీసుకువచ్చి కొట్టి అతని ఫోన్ సీజ్ చేశారు ఇది ఎక్కడి న్యాయం అని ప్రశ్నించారు. పోలీసుల పనితీరు ప్రభుత్వానికి ఒక న్యాయం, ప్రతిపక్షాలకు ఒక న్యాయంలా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టం అందరికీ సమానమేనని, పోలీసుల తీరు ప్రజాస్వామ్యంగా లేదన్నారు. పోలీసు చర్యల ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను భయపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు ఒకసారి కేసీఆర్ పిలిపునిస్తే లక్షలాదిగా కార్యకర్తలు తరలివస్తారని గుర్తు చేశారు. మూడున్నర సంవత్సరాల పదవీకాలం ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి వాళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను చాలామంది ట్రోల్ చేశారని వాళ్లపైన ఎందుకు కేసు పెట్టలేదన్నారు. తాగునీరు, విద్యుత్, రైతు భరోసా కోసం రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. మెదక్ ఎమ్మెల్యే అందుబాటులో లేక సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు కృష్ణాగౌడ్, కిష్టయ్య, గౌస్, ప్రభురెడ్డి, మాజీ సర్పంచ్‌లు లింగం, సాయిలు, యామిరెడ్డి, మైహిపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, ఎలక్షన్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

కొమురవెల్లి, ఏప్రిల్ 20 : బీఆర్‌ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించడంతో పాటు అవసరమైన వారికి హైదరాబాద్‌లోని కంటి దవాఖానలో శస్త్రచికిత్సలు చేయించడం గొప్ప విషయమన్నారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి ఎమ్మెల్యే పల్లా దగ్గరుండి స్వయంగా భోజనం వడ్డించారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, ముత్యం నర్సింహులుగౌడ్, గొల్లపల్లి కిష్టయ్య, బుడిగె గురువయ్యగౌడ్, ఏర్పుల మహేశ్, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, బొంగు తిరుపతిరెడ్డి, పచ్చిమడ్ల స్వామిగౌడ్, బూర్గు స్వామిగౌడ్, బొడిగం వంశీ, బుడిగె రమేశ్, పుట్ట కనకరాజు, వైద్యులు, సిబ్బంది, బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి